మరుసటి దినము వనమయ్యగారి కిళ్ళీకొట్టు మూసివేయబడలేదు! (అతని మామ ఉన్నాడుగా) కాని, నిరుద్యోగులు అచ్చోట వినబడేవాక్కు కోల్పోయారు. వెంకయ్య బి. ఎ. గారు మరుసటి దినము ఆ షాపుదగ్గరికి చేరేటప్పటికి బఠాణి బిరుదాంకితులు, ఈశ్వరరావుగారు మాత్రము నిలబడి ఉన్నారు. "ఏమిటిసంగతీ" అంటూ వెంకయ్య బి. ఎ ను పలుకరించాడు. "మిగతా ఒక్క ఖాళీ డిప్టీకలెక్టరుగారి దూరపు చుట్టమట, ఆయనగారిచే ఆక్రమింప బడింది" అంటూ బఠాణీ నైరాశ్యంతో, తన శ్రమంతా వృథా అయినందుకు విచారిస్తూ, వ్యంగ్యంగా నవ్వాడు. వెంకయ్య బి.ఎ. ఆదేపట్టణాంలో, ఇలాగే నిరాశ చెందడం ఆరవ సారి.

---

కథానిక

# మరపురాని రోజు

"భరణి"

"మొగలి జడ కుట్టవా అత్తయ్యా?" అంటూ పరుగెత్తుకొచ్చింది రాధ. ఆ పట్టు పరికిణీ గరగరలతోపాటు మొగలిపొత్తు వాసనలు ఘుమ్మున విరజిమ్మినయ్. అవి లక్ష్మి నాసికా రంధ్రాల్లోంచి హృదయంలోకి దూసుకుపోయి గిరగిరా తిరుగుతూ గతాన్ని జ్ఞాపకంచేస్తూ తెలియని అనుభూతితో నింపేసినయ్ హృదయాన్ని. చేతులు మొగలి జడను అల్లుతున్న వన్న మాటేగాని హృదయం యెక్కడో యే దూరప్రదేశాల్లోనో, ముద్దు పలుకులు పలుకుతున్నప్పట్నించి ముగ్ధ అయ్యేవరకు జరిగిన సంఘటనలను తెరలు తెరలుగా జ్ఞాపకంచేస్తూ విహారిస్తోంది.

ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ నేలమీద యిప్పుడు కూడా అడుగుజాడ లుంటే! వాళ్ళు చెయ్యీచెయ్యీ కలిపి గెంతుతూ తిరిగిన ఆ పచ్చని పచ్చిక, చిలిపి కయ్యాలాడుకుంటుంటే "అయ్యో! హాయిగా ఆడుకోక యీ పిల్ల అలా పోట్లాడుతుందేం?" అన్నట్లుగా విచారంగా తలలూపే ఆ చెట్లు, "యీ బాలికకు అనురాగాన్ని హృదయంలో హత్తుకునేటట్లు చేసే వుపాయం బాగా తెలుసునే" అనుకుంటూ వారిని చూస్తూ ఆనందంగా యింకా కవ్విస్తున్నట్లుగా తన వాసనలు విరజిమ్ముతూ కదలాడే ఆ సన్నజాజి మొక్క, రోజూ మాయకుండా అక్కడపడే వారి అడుగుజాడలకు సాక్ష్యం.

లక్ష్మి చిన్నప్పట్నుంచీ కొంటెపిల్ల! కోపం యెప్పుడు చుర్రున ముక్కుకొస నంటుకుంటుందో యెప్పుడు మాయమౌతుందో తెలిసేదిగాదు. చిన్నప్పట్నుంచి లక్ష్మి కృష్ణమూర్తి ఒక్కచోట తిరిగారు. ఆ చిన్నదొడ్డంతా పచ్చగా గడ్డిపెరిగి చిన్నచిన్న మొక్కలు వుండేవి. ఎప్పుడూ ఆ గడ్డిలో తిరుగుతుండేవాళ్ళు. ఆకాశంమీద విరజిమ్మినట్లు మెరిసేపోయే నక్షత్రాల్లా, ఆ పచ్చని గడ్డిమీద చిన్నచిన్న రంగులరంగులపూలు విరజిమ్మినట్లు నిండుకుని ఆహ్లాదాన్ని యిస్తుండేవి. వర్డ్స్‌వర్తు డాఫడల్స్‌ను మరిపిస్తుండేవి! ఆ కవి డాఫడల్స్‌ను అంత మనోజ్ఞంగా యెందుకు చిత్రించాడో వాటిని చూచినవాళ్ళకు తెలిసితీరుతుంది. ఆ రంగురంగుల పూలమీద సూర్యుని ఎర్రటి లేత కిరణాలుపడి మెరిసిపోయేవేళ ఆ పసిహృదయాలు రెండూ పరుగుపరుగున వెళ్ళి వాటిని చేతుల్లోకి తీసుకుని ఆడేవారు. అప్పుడు ఆ పువ్వుల్లోని అందమంతా వాళ్ళ ముఖాల్లో మెరిసిపోతుండేది! ఆ పూలన్నీ కోసి యిద్దరూ గుచ్చాలి. తను పెద్దదండ గుచ్చలేదని తనకు తెలుసు. కాని త్వరగా త్వరగా తన చిన్నచేతుల గాజులు గలగలలాడిస్తూ గుచ్చుతుండేది. ఇంతలో పెద్దదండ గుచ్చకూడ దనుకుంటూనే కృష్ణ పెద్దది గుచ్చేవాడు. నాది పెద్దదండ అనగూడదనుకుంటూనే అనేవాడు. వెంటనే లక్ష్మికి వుడుకుబోతుతనం

వచ్చేది. అతని చేతిలో పూలు లాక్కుని తుంచి క్రిందబోస్తూ 'నువ్వెప్పుడూ యింతే, నా పూలన్నీ లాక్కుని పెద్దదండ కడ్తావు. అంతా మోసం!' అంటూ యేడ్చుకుంటూ వెళ్ళిబోయేది. కృష్ణకు తెలుసు మళ్ళా మాట్లాడుతుందని, కాని వెంటనే కించపడిపోయి మాట్లాడించాలన్నట్లు వెనక వెనక తిరిగేవాడు. అతను వెనక వెనక తిరిగినంతసేపు మరీ కోపంతో ముడుచుకుపోయేది. వెంటనే కృష్ణ వెళ్ళి లక్ష్మిబొమ్మ తెచ్చి యెదురుగా బెట్టి 'అనగనగా ఓ అమ్మాయి ఆ అమ్మాయి చాలా బావుంటుంది. చాలా మంచిది. కాని కోపం వస్తుంది. ఇప్పుడు ఆ అమ్మాయిగారికి కోపం వచ్చింది. అమ్మా—యిగా—రికి కోపం వచ్చిందీ—' అంటూ రాగంలో యెగరడం మొదలు పెట్టేవాడు. ఆ గంతులుచూసి కిలకిలా నవ్వేది. అక్కడికి ఆఖర్! వెంటనే "కుంకుమ పురుగు లేరుకుంటున్నాను." అంటూ పరుగెత్తేనాడు. వెనకాలే చిన్న జడను యెగరేసుకుంటూ చెవులలోలకులు గలగల మనిపిస్తూ పరుగెత్తేది.

ఆ గడ్డిలో పట్టుకుచ్చులాంటి బొచ్చుతో యెర్రగా కుంకుమ పురుగులు తిరుగుతుండేవి. అవి ఆగడ్డిలో అందంగా నెమ్మదిగా కదులుతుంటే చూచి ఆనందించేవాళ్ళు. అగ్గిపెట్టెలో వాటిని పెట్టి తినడానికి కొంచెం గడ్డివేసి దాచితే రేపటికి కుంకుమ పెడతాయని వాళ్ళ నమ్మకం. నాలుగయిదు యేరి అగ్గిపెట్టెలో వేసి జాగ్రత్తగా దాచేవాళ్ళు. మరునాడు ప్రొద్దుటే వెళ్ళి అగ్గిపెట్టె యిద్దరి మధ్యలోపెట్టి గొప్ప చిత్రాన్ని చూడబోతున్నట్టు కళ్ళు పెద్దవిజేసి చూస్తూ తెరిచేవాళ్ళు. నాలుగు కళ్ళూ ఆత్రంగా చూసేవి అందులో యేముంది? చచ్చిపోయిన పురుగులు! లక్ష్మికి కోపంగా పూర్తిగా వచ్చేసేది. "కుంకుమ యేదీ? చచ్చిపోయాయే!" అంటూ అధికారిణిలా గట్టిగా అరిచేది. నేరం చేసిన వాడిలా మరి నువ్వు త్రాగడానికి నీళ్ళు యివ్వలేదుగా! అనేవాడు. దాన్ని నేలకేసికొడ్తూ, "నువ్వెప్పుడూ యింతే. నాకు తెలియకుండా కుంకమంతా దాచేశావు. అంతా మోసం." అంటూ యేడుస్తూ కాళ్ళెగరేసుకుంటూ వెళ్ళిపోయేది. మళ్ళీ అదే వరస. ఒకరి వెనుక ఒకరు. అదెంతో సేపుండేది కాదు. మళ్ళీ ఆడుకునే వఱకూ.

రమ వాళ్ళది పెద్దతోట. సాయంత్రం సంజ చీకటి పడేవేళ పిల్లలందరూ అక్కడ చేరేవాళ్ళు. అంతా కలిసి ఆటలు. ఆకు ఆట వద్దంటుంటే కూడా అందరూ ఆడుదామనేవాళ్ళు. ఏ ఆకు పేరుచెప్తే అది దొంగ కోసుకురావడానికివెళ్లాలి. ఇంతలో అందరూ దాక్కుంటారు. దొంగ ఆకు కోసి ఎవరిపేరైనా చెప్తూ రావాలి. తక్కిన వాళ్ళంతా బయటికొచ్చేస్తారు. దొంగ ఆ పేరు గలవాళ్ళని కనుక్కోవాలి. కృష్ణ పిల్లలందరకు రహస్యంగా లక్ష్మిని దొంగచెయ్యమని చెప్పేవాడు. వాళ్ళు చేసేవాళ్లు. కృష్ణతోటలో మూలగా వున్న రావిచెట్టు ఆకు తెమ్మనేవాడు. అంతా తలలూపేవాళ్ళు. లక్ష్మికి కోపం వచ్చేది. కాని ఆట అని మొదటిసారిగా క్షమించేది. లక్ష్మికి ఆ రావిచెట్టు తనని మింగేయడానికి పుట్టిన రాక్షసునిలా కనబడేది. రావిచెట్టుమీద పట్టరానికోపం వచ్చేది. 'తను చెట్టు యెక్కలేనని యెప్పుడూ దానిపేరు చెప్తారు' అనుకుంటూ కోపంగా చెట్టు మీదికి రాయివిసరి ఆకురాల్చి తీసుకుని పరుగెత్తేది. కోపంకొద్దీ వద్దనుకుంటూనే కృష్ణపేరు అరుచుకుంటూ పరుగెత్తేది. అంతా బయటకు వచ్చి లక్ష్మిచుట్టూ మూగేవాళ్ళు. లక్ష్మి వెనకపడి అక్కడే వున్నట్లు 'కృష్ణా! జాగ్రత్త' అంటూ తిరిగేవాళ్ళు. అంతా వెదికేది. ఎక్కడా కనబడక వుడుకుబోతుతనం వచ్చి అక్కడే కూర్చుని యేడుపు మొదలు పెట్టేది. ఇంతలో యే చెట్టు కొమ్మమీదినుంచో దిగివచ్చి ఓడిపోయావు అనేవాడు. కోపం యెక్కువై, కన్నీళ్ళు పిచికారీలోంచి నీళ్ళువచ్చినట్లు లోపలినుంచి బైటికి నెట్టుకునివచ్చి కళ్ళల్లోంచి జలజలా రాలేవి. మళ్ళీ "నువ్వెప్పుడూ అంతే. నేను యెక్కలేనని దానిమీద దాక్కుంటావు. అంతా మోసం" అంటూ దురుసుగా నడిచేది. లక్ష్మి వెనకాలే మళ్ళా అలానే బయలుదేరేవాడు. ఇంతలో రమ మామ్మగారు "అమ్మా లక్ష్మీ! సన్నజాజిపూలు కోసుకోలేదేం తల్లీ!' 'అన్న మాటలు వినబడేవి. ఆ కన్నీటి కళ్ళతో ఒక్కసారి సన్నజాజివైపు చూచేది. అది రమ్మని పిలుస్తున్నట్లుగా తలవూపేది. సంతోషంతో పరుగెత్తి బల్ల

వేసుకుని కోయడం మొదలుబెట్టేది. కృష్ణ ఓ పక్క వయ్యారంగా నుంచుని వోరగా చూస్తుండే వాడు. అందినవన్ని కోసేది. మిగిలినవి కోయడానికి పిలుద్దామనుకునేది. అలాగే చూసేవాడుకాని వెళ్లే వాడు కాడు. పిలవకుండా రావాలనుకునేది. పిలిస్తే వెళ్దామనుకునేవాడు. తను పిలిచినా రానట్లు కోపం ముంచుకొచ్చేది వెంటనే ఒళ్ళోపూలన్నీ కింద పోసేసి మళ్ళీ అలా అంటూ ఏడుస్తూ వెళ్ళి పోయేది. ఆ చిన్న జడ తేలుకొండిలా వెనక్కి తిరిగి కృష్ణని కిట్టొచ్చినట్లుగా కదిలేది! అందుకే యెదురుచూస్తున్నట్లుగా త్వరగావెళ్ళి పూలన్నీ చొక్కాలో బోసుకొని వెనక పరుగెత్తేవాడు. ఆ పూలన్నీ యెదురుగా బోసి చూడాలన్నట్లు ఒక్కొక్కటి గుచ్చేవాడు. దండ పూర్తవ్వుతుంటే లక్ష్మికి ఆనందం యెక్కువయ్యేది. ఎంత త్వరగా జడలో పెట్టుకుందామా అనిచూసేది. చక్కగా దండగుచ్చి బొమ్మను యెదురుగా బెట్టుకుని "అనగనగా ఓ అమ్మాయి. ఆ అమ్మాయికి సన్నజాజిపూలంటే యిష్టం. కావాలా తీసుకో" అని దానిమీద వేసే వాడు. అందుకే యెదురుచూస్తున్న లక్ష్మి కిలకిలా నవ్వుతూ వచ్చి పూలు లాక్కునేది. మళ్ళ యిద్దరూ చేతులుకలిపి ఆడుకునేవారు.

అలా ఆనందంగా అనురాగాన్ని పెంచుకుంటూ ఆ చిన్న హృదయాలు పెద్దవైనయ్. ఆ చిన్న భావాలు పెరిగినయ్. వాళ్ళ అందంతోపాటు చిలిపికయ్యాల అందంగూడ పెరిగి రసవత్తరమైంది. ఓనాడు ఆ రెండు హృదయాలు పూర్తిగా కలసి ఒకేమార్గంమీద నడవవలసినవైనయ్.

కాని అప్పటికీ లక్ష్మి కొంటెతనం పోలేదు. కాని దానితో కోపపుపాళ్లు తగ్గి చిలిపితనం హెచ్చయింది. క్యాంపునుంచి వస్తానన్న రోజుకన్న ఓరోజు ఆలస్యమైతే వచ్చేటప్పటికి మాట్లాడేది కాదు. మనిషినిచూడగానే మాత్రం "నువ్వెప్పుడూ అంతే అంతా మోసం!"అన్న మాటమాత్రం అప్పగించేది. మళ్ళా అదేప్రకారం రాజీ కుదిర్చేవాడు. ఎప్పుడూ నువ్వు నా యెంకివి లక్ష్మి అనేవాడు. "నేను యెంకినికాదు"అంటూ చెవులో రహస్యంగా "మీ లచ్చిని నేను" అనేది. ఇలా ఆనందంతో ఒక సంవత్సరం గడిచింది. ఆ రోజువరకు అన్నీ స్వచ్ఛమైన మేఘాలే. కాని ఆరోజునుంచి అవే నల్లనిమబ్బులై వెన్నెలరాత్రులన్నీ కాలరాత్రులై పోయినయ్.

పల్లెటూళ్ళకు వెళ్ళేదారిలో బాట కిరువైపులో మొగలి పొదలు కమ్ముకుని వుండేవి. అవిదాటేంత వరకు వాటి వాసనలు మత్తెక్కిస్తూ యేమీ తెలియని వాడిగా చేసేయి. ఇంటికి రాగానే వాటి సంగతిచెప్పేవాడు.అప్పుడు,లక్ష్మి ఆశక్తిగావింటూ అవి నాకు కావాలిఅన్నట్లు,పెద్దకళ్ళుచేసిచూసేది.

ఆరోజు పల్లెటూరువైపు క్యాంపు కెళ్ళాడు. ఆ రోజు రాలేదు. లక్ష్మి యెదురుచూసింది వుక్రోషంలో. "ఎప్పుడూ అంతే. అంతా మోసం" అనుకుంటూంది కసిగా మనసులో. మరునాడు యెదురు చూస్తూ నుంచుంది. ఇంతలో యెవరో కృష్ణమూర్తిని తీసుకుని వచ్చారు. వచ్చింది కృష్ణమూర్తికాదు. అది అతని శవం—! లక్ష్మివణికి పోయింది. ఒక్కసారి కూలి నేలమీదపడిపోయింది. ఆ దుఃఖాన్ని చెప్పాలంటే ఆ కన్నీళ్ళు కాలువలై చెఱువులై, సరస్సులై, నదులై సముద్రాల్లోకలిసి వుంటయ్! కాని ఏంలాభం! నిర్మలమైన ప్రేమికులు యిలా అవగానే గుండెపగిలి చచ్చిపోతారంటారే! మరి నాకు ఆలా అలా అవ్వదేం? గుండె పగలదేం! అని విలపించింది. కృష్ణమూర్తికి యేమైంది? ఆరోజుకూడా అతడు ఆ దోవవెంట మొగలిపూవుల వాసనలు మోసుకుంటూ వెళ్తున్నాడు. ఆ వాసనలు అతన్ని మత్తెక్కిస్తున్నయ్. రోజూ అనుకుంటాడు. ఒక్కరోజు ఓ మొగలి పొత్తు కోద్దామని ఆరోజున ఆకోర్కె ప్రభలమై పొదను సమీపించారు. పొదలో వెదకి పెద్ద చక్కటి మొగలిపొత్తు కోయడానికి చెయి జాచాడు. బుస్—! మంది, కృష్ణమూర్తి వణికి పోయాడు. చెయ్యి లాక్కోబోయాడు. కాని అయిపోయింది. తన విషాన్ని ఆ నిర్మల ప్రేమికుని లోకి యెక్కించి అది తనదారిన తాను పోయింది. ఒక్కరోజు ఆనందపరుద్దామని, అసలు జీవితానందాన్నే తుడిచేసి విషాదాంతాన్ని చేసి వెళ్ళి పోయాడు. ఆరోజునుంచి అది పూర్వపు మధుర స్మృతుల మరపురాని రోజులతోపాటు ఒక మరుపురాని రోజై మదిలో వేదిస్తూంటుంది. ఎక్కడి నుంచో నువ్వనా...! నువ్వనా...! అంటున్నట్లుగా వుంటుంది లక్ష్మికి. ★